క్లుప్తంగా

డీ- 40 కాల్వకు నీరు విడుదల చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నల్లగొండ టూటౌన్: పానగల్ ఉదయ సముద్రం డీ- 40కాల్వ ద్వారా తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాల్లో 14 గ్రామాలకు సాగునీరు విడుదల చేయాలని వివిధ గ్రామాల రైతులు బుధవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కాల్వ కోసం తాము స్వచ్ఛందంగా భూమి ఇచ్చామని 2008లో తమ భూములకు సాగునీరు వచ్చినట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండినందున వెంటనే కాల్వకు నీరు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నంద్యాల కృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, సత్తిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొడిదెల శ్రీను, లింగస్వామి, యాదయ్య, నాగయ్య, కొడిదల రాములు, కొల్లూరు శ్రీను, నాగరాజు, సైదులు, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ పనులు ప్రారంభం



ప్లాట్ కొలతలను పరిశీలిస్తున్న అధికారులు

నల్లగొండ టూటౌన్: అనుమతి లేని లేఅవుట్‌లలో కొనుగోలు చేసిన ప్లాట్లను ఎల్‌ఆర్‌ఎస్ కింద క్రమబద్ధీకరించేందుకు మున్సిపల్, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభించారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని రాక్‌హిల్స్ కాలనీ, మామిళ్లగూడలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్లను పరిశీలించి కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తులు చేసుకున్న ప్లాట్లను త్వరగా క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు త్వరగా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి తమ ప్లాట్ల క్రమబద్ధీకరణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ ఏసీపీ ఎండీ ఖుదూష్, టీపీఎస్ మధు పాల్గొన్నారు.

అమృత్ పనులు వేగవంతం చేయాలి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలో చేపడుతున్న అమృత్ ట్యాంక్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని అక్కచల్మ, వినాయక హౌజింగ్ బోర్డు కాలనీ, శివాలయం, అన్నేశ్వరమ్మ గుట్ట, రాంనగర్ పార్కు, ప్రభుత్వ ఆస్పత్రిలో చేపడుతున్న ట్యాంక్‌ల నిర్మాణ పనులను ఆయన ప్రజారోగ్యశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనులు నాణ్యతతో చేపట్టి, సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ప్రజారోగ్య శాఖ ఎస్‌ఈ కందుకూరి వెంకటేశ్వర్లు, ఈఈ సత్యనారాయణ, డీఈ మనోహర, ఏఈ నాగప్రసాద్ ఉన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

నకిరేకల్: మహబూబాబాద్‌లో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర పీవైఎల్ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బీవీ. చారి కోరారు. బుధవారం నకిరేకల్‌లోని యనాలా మల్లారెడ్డి స్మారక భవనంలో శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

మర్రిగూడ: పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పాల్వాయి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మాస బాలరాజు, గౌరవ అధ్యక్షుడిగా నాగయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా అల్వాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, కార్యదర్శిగా సతీష్‌రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా సుమనాదేవి, కార్యదర్శిగా సక్కుబాయి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డివిఎస్ ఫణికుమార్, యుగేందర్, రఘువర్ధన్ రావు, బిట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి మండల అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి

కేతేపల్లి: టీఎస్ పీఆర్‌టీయూ కేతేపల్లి మండల అధ్యక్షుడిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. బుధవారం కేతేపల్లిలో నిర్వహించిన సంఘం మండల సర్వసభ్య సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శిగా జెల్ల రమేష్, అసోసియేట్ అధ్యక్షుడిగా రాచకొండ శ్రీధర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఉప్పు సునీత, ఉపాధ్యక్షులుగా కోటేశ్వరరావు, కనుకుంట్ల గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శులుగా నక్కల రమేష్, కె.లోకేష్, మహిళా కార్యదర్శిగా కొంగరి శోభ ఎన్నికయ్యారు.

వేగంగా డబుల్ రోడ్డు పనులు

- రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన శాలిగౌరారం- గురుజాల రోడ్డు
- బీటీ మినహా మిగతా నిర్మాణ పనులు పూర్తి
- తీరనున్న వాహనదారుల ఇబ్బందులు



బీటీ వేసేందుకు సిద్ధంగా ఉన్న శాలిగౌరారం- గురుజాల రహదారి

శాలిగౌరారం: మండలంలో సింగిల్‌రోడ్డుగా ఉన్న శాలిగౌరారం - గురుజాల ఆర్‌అండ్‌బీ సింగిల్ రోడ్డును రూ.5 కోట్ల వ్యయంతో 2.1 కిలోమీటర్లు డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గత సంవత్సరం జూన్‌లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు ప్రారంభం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేల్ డిసెంబర్ 31న రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.

నిర్మాణ పనులు ఇలా...

శాలిగౌరారం నుంచి గురుజాల వరకు డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు సీఆర్‌ఐఎఫ్(సెంట్రల్ రోడ్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్) నుంచి ప్రభుత్వం రూ. 5 కోట్లు మంజూరు చేసింది. ఇందులో 1.60 కిలోమీటర్లు బీటీ డబుల్‌రోడ్డుతో పాటూ శాలిగౌరారం బస్టాప్ సమీపంలో బాక్స్‌బ్రిడ్జి, రామగిరిలో 400 మీటర్లు పొడవు సీసీతో డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రెండు లేయర్లుగా వేయనున్న బీటీ పనులు మినహా రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

విద్యుత్ లైన్ల మార్పిడిలో స్పందన లేదు..

శాలిగౌరారం-గురుజాల రోడ్డు వెంట ఉన్న విద్యుత్ లైన్లను మార్పు చేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు సంబంధిత ఉన్నతాధికారులకు విన్నవించారు. కాని నేటికీ విద్యుత్ లైన్ల మార్పిడి మాత్రం జరగలేదు. రోడ్డు నిర్మాణానికి నిర్ణీత గడువు దగ్గర పడుతుండటంతో సంబంధిత రోడ్డు నిర్మాణ సంస్థ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టి వేగంగా పూర్తిచేస్తోంది. విద్యుత్ లైన్ల మార్పిడి విషయంలో విన్నవించినా సంబంధిత అధికారులు స్పందించలేదని ఆర్‌అండ్‌బీ అధికారులు వెల్లడించారు.

రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది



శాలిగౌరారం-గురుజాల రోడ్డు అభివృద్ధితో రవాణా సౌకర్యాలు మెరుగుపడుతాయి. రోడ్డు అభివృద్ధిని మూసీనదిపై ఉన్న మానాయికుంట బ్రిడ్జి వరకు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. దీంతో ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాలకు రోడ్డుమార్గం ఎంతో సులువుగా మారడంతో రవాణా సౌకర్యాలు పెరుగుతాయి.

– గుండా శ్రీనివాసులు, గురుజాల

నిర్ణీత సమయంలో పూర్తి చేస్తాం



శాలిగౌరారం-గురుజాల డబుల్‌రోడ్డు పనులు వేగంగా పూర్తిచేస్తున్నాం. ఇప్పటికే బీటీ పనులు మినహా మిగిలిన రోడ్డు నిర్మాణ పనులన్నింటినీ పూర్తిచేశాం. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో బీటీ పనులు చేపట్టలేదు. వాతావరణం అనుకూలిస్తే పనులు పూర్తి చేసి నిర్ణీత సమయంలోనే వినియోగంలోకి తీసుకువస్తాం.

– సంతోష్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఏఈ

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

కేతేపల్లి: ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హులైన ప్రతి రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని, బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.31వేల కోట్లతో రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని, ఇప్పటికే రూ.19వేల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. సాంకేతిక సమస్యలతో అర్హులైన కొందరి రైతులకు రుణమాఫీ కాలేదని, వారి నుంచి అర్జీలు స్వీకరించి మాఫీ వర్తింపజేస్తామని పేర్కొన్నారు.

నేడు అఖిలపక్ష సమావేశం

చిట్యాల: పట్టణంలోని జాతీయ రహదారిపై నిర్మించనున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులపై గురువారం అఖిల పక్షాల సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మండల రూరల్ కార్యదర్శి అరూరి శ్రీను బుధవారం తెలిపారు. చిట్యాలలోని ముప్ప మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగే సమావేశానికి అఖిలపక్ష పార్టీలతో పాటు ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దుకాణదారులు, వ్యాపారస్తులు పాల్గొనాలని కోరారు.

రైతులు ఆందోళన చెందొద్దు

కనగల్: సాంకేతిక సమస్యలు, బ్యాంక్ అకౌంట్ ఖాతాలు సరిగా లేనివి, పాస్ బుక్ నంబరు లేనివి, బ్యాంక్ ఖాతాల్లో ఉన్న పేర్లతో ఆధార్ కార్డులో ఉన్న పేరుతో సరిపోలని రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ కాలేదని మండల వ్యవసాయ అధికారి అమరేందర్ గౌడ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రైతులు ఆందోళన చెందొద్దని, రుణ మాఫీ జమ కాని రైతులు తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వృద్ధులకు చీరల పంపిణీ

నల్లగొండ రూరల్: పట్టణంలోని సుందరయ్య కాలనీలో భక్తాంజనేయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. పులిజాల కీర్తన జన్మదినం సందర్భంగా బ్రాహ్మణ సేవా సమితి నాయకులు ఈ చీరలు అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, భక్తాంజనేయ సేవా సమితి అధ్యక్షుడు శ్రీనివాసశర్మ, రుద్రాక్షి నరసింహ, సభ్యులు భరత్, నాగశ్రీ పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గణేష్

చండూరు: భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చండూరుకు చెందిన పేర్ల గణేష్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులకు మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పనుల్లో లక్ష్యాన్ని అధిగమించాలి

- డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

శాలిగౌరారం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల నిర్వహణలో లక్ష్యాన్ని అధిగమించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకం, ఐకేపీ కార్యాలయాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లోని రికార్డులు పరిశీలించారు. అనంతరం మండల మహిళా సమాఖ్య ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఉపాధి పనుల నిర్వహణలో ఇచ్చిన టార్గెట్‌కు అనుగుణంగా పనులు చేపట్టాలన్నారు. పనుల నిర్వహణతో పాటు గ్రామపంచాయతీలోని ఈజీఎస్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీకి ఫాంపాండ్, ఫిష్‌పాండ్ ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. సిబ్బంది విధులపట్ల అలసత్వం వహిస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, డీపీఎం మోహన్‌రెడ్డి, ఏపీఎం జానకి, మండల సమాఖ్య ప్రతినిధులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలు చేసినా పట్టించుకోకపోవడం అన్యాయం



మాట్లాడుతున్న పాలకుర్తి కృష్ణమూర్తి

నల్లగొండ టూటౌన్ : దీర్ఘకాలంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అనేక పోరాటాలు చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి అన్నారు. బుధవారం నల్లగొండలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రెండవ పీఆర్సీ గతేడాది జూలై నుంచి అమలు చేసి 20 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, ఈహెచ్‌ఎస్ ద్వారా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య అందించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్‌చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్, పాదూరి విద్యాసాగర్‌రెడ్డి, కుకుడాల గోవర్ధన్, యానాల కృష్ణారెడ్డి, వై.సత్తయ్య, ఎండీ.అబ్దుల్‌ఖాదర్, వనం శ్రీవాణి, రమేష్, కౌసల్య, భిక్షమయ్య, కృష్ణమూర్తి, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

డిండి ఎత్తిపోతల డీపీఆర్‌ను ఆమోదించాలి



మర్రిగూడలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న సీపీఎం నాయకులు

మర్రిగూడ: డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ.. మునుగోడు, దేవరకొండ ప్రాంతాలకు సాగునీరు ఇవ్వడంలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. మునుగోడు, దేవరకొండ ప్రాంతాల్లో ఫ్లోరిన్ అధికంగా ఉండడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకూ సీపీఎం దశల వారీగా పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో నీలకంఠం రాములు, మైల సత్తయ్య, పిట్టల రమేష్, నీలకంఠం యాదయ్య, ఊరిపక్క కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

చండూరు(గట్టుప్పల్): డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్ ను ఆమోదించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గట్టుప్పల్ మండల కేంద్రంలో బుధవారం రెండో రోజుకు చేరాయి. కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం హాజరై మాట్లాడారు. చాపల మారయ్య, మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, కర్నాటి సుధాకర్, అచ్చిన శ్రీనివాస్, బుచ్చి రెడ్డి, నల్లవెల్లి భిక్షమయ్య, కర్నాటి వెంకటేశం, రబ్బాని, శంకరయ్య, రాములు తదితరులున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మర్రిగూడ: బైక్‌పై వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో కిందపడి ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన మర్రిగూడ మండలం సరంపేట క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం జరిగింది. మునుగోడు మండలం దాసర్లపల్లి గ్రామానికి చెందిన జింకల స్వామి తన అత్తగారి ఊరైన మర్రిగూడ మండలం యరగండ్లపల్లికి వచ్చి బుధవారం తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మర్రిగూడ చౌరస్తా వద్ద ఓ వ్యక్తికి లిఫ్ట్ ఇచ్చాడు. వీరు సరంపేట క్రాస్ రోడ్డు సమీపంలోకి రాగానే దారి వెంట వెళ్తున్న కుక్క అడ్డురావడంతో దాని తప్పించబోయి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రుల బంధువులకు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించారు.

స్కూటీపై హైవే దాటుతుండగా..

చిట్యాల: పట్టణ శివారులో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణంలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారి వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిని స్కూటీపై వెళ్తున్న మహిళ దాటుతుండగా హైదరాబాద్ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహిళ కాలు విరగగా.. అదే స్కూటీపై వెళ్తున్న మరో చిన్నారికి స్వల్ప గాయాలు అయ్యాయి.

రేపు సీపీఎస్ ఉద్యోగుల నిరసన

రామగిరి(నల్లగొండ): ఉద్యోగ, ఉపాధ్యాయులకు కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) విధానాన్ని వర్తింపజేస్తూ గత ప్రభుత్వం జీఓ 28ను జారీచేసిన ఆగస్టు 23ను బ్లాక్ డేగా గుర్తిస్తూ శుక్రవారం నిరసన తెలియజేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పున్న సోమనాథ్ బుధవారం తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రతి సీపీఎస్ ఉద్యోగి ఆగస్టు 23న నల్ల రిబ్బన్ ధరించి నిరసన తెలియాలని, మండల, జిల్లా కేంద్రాలలో జీఓ నంబర్ 28 ప్రతులను దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ మర్రిగూడ గ్రామ అధ్యక్షుడిగా శేఖర్

మర్రిగూడ: కాంగ్రెస్ పార్టీ మర్రిగూడ గ్రామశాఖ అధ్యక్షుడిగా పానుగోటి శేఖర్ ఎన్నికయ్యారు. మర్రిగూడ మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామ శాఖ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మాస నీలిమాచంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, మాజీ కోఆప్షన్ ఎండీ ఇక్బాల్, పల్లె మల్లేష్, ఈద రాములు, అశోక్, షర్ఫొద్దీన్, చంద్రయ్య, అంజయ్య, వంపు వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల అందజేత

చిట్యాల: 'యూత్ ఫర్ సేవా' సంస్థ సహకారంతో చిట్యాల పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు ఆ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు చిలుకరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కూల్ బ్యాగులను బుధవారం హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోగికార్ మాధవి, కోణం శ్రీనివాస్, సైదులు, ప్రసన్న, మంజుల, శంకరయ్య, సాధిక్, జానకి తదితరులు పాల్గొన్నారు.

గుత్తా అమిత్‌కు సన్మానం



అమిత్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డి తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియామకమవడంతో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గుత్తా వెంకట్రాంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం గుత్తా యువసేన అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆయనను కలిసి సన్మానించారు. వారిలో సుంకరి వెంకన్నగౌడ్, పల్లపు బుద్దుడు, రాచకొండ కృష్ణయ్య, కల్లూరి మల్లారెడ్డి, రంగా వెంకటేశ్వర్లు, తేరటుపల్లి హన్మంతు, ఐతగోని స్వామిగౌడ్, గుండె రవి, మర్రి రమేష్ తదితరులున్నారు.

శిగరాయికుంటకు గండి

చండూరు(గట్టుప్పల్): గట్టుప్పల్ మండలం పరిధిలోని ధర్మతండా సమీపంలో శిగరాయికుంటకు వరద ఉధృతి పెరగడంతో నిండే దశకు చేరింది. దీంతో కుంటకు బుధవారం ఉదయం గండి పడడంతో కుంట నుంచి నీరు వృథాగా పోతోంది. గ్రామ కార్యదర్శి షఫీ సంబంధిత ఐబీ అధికారులకు సమాచారం అందించారు. కాగా.. కంప చెట్లు ఎక్కువగా ఉండడంతో కట్ట బలహీన పడి గండి పడిందని, గతంలో కూడా ఈ ప్రాంతంలోనే గండి పడితే పూడ్చామని రైతులు చెబుతున్నారు.



శిగరాయికుంట నుంచి వృథాగా పోతున్న నీరు

ఫీడర్ చానల్‌లో పేరుకుపోయిన ముళ్లకంప



పలివెల ఫీడర్ చానల్‌లో ఉన్న ముళ్ల కంప

మునుగోడు: మండలంలోని మునుగోడు పెద్దచెరువుతో పాటు ఎల్లగూడెం ఎర్రకుంట, జక్కలవారిగూడెం నడిమికుంటలకు పెద్దవాగు నుంచి నీరు వచ్చే పలివెల ఫీడర్ చానల్ ముళ్ల పొదలతో నిండిపోయింది. దీంతో వర్షం కురిసినప్పుడు వచ్చే వరద నీరు కాల్వలో పారకుండా ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. గత వేసవిలో కాల్వలో ఏపుగా పెరిగినా కంప చెట్లని అధికారులు ఉపాధి హామీ కూలీలతో కొట్టించారు. ముళ్ల కంప కాల్వలోనే ఉండడంతో నీరు పారే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఇటు చెరువులు నిండకపోగా అటు కాల్వపై ఒత్తిడి పెరిగి అక్కడా అక్కడా తెగి నీరు తిరిగి వాగులో కలిసి పోయే ప్రమాదం నెలకొంది. ఈ విషయంపై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

వృద్ధులను పోషించాల్సింది పిల్లలే

- మున్సిఫ్ కోర్టు జడ్జి ఆరీఫ్



పండ్లు పంపిణీ చేస్తున్న జడ్జి ఆరీఫ్

నకిరేకల్: వృద్ధులైన తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత వారి పిల్లలదేనని నకిరేకల్ మున్సిఫ్ కోర్టు సివిల్ జడ్జి ఎస్‌కే ఆరీఫ్ అన్నారు. బుధవారం నకిరేకల్ మండలం తాటికల్ శివారులోని లయన్స్ వృద్ధాశ్రమంలో స్థానిక లయన్స్ క్లబ్, మండల న్యాయ సహాయ కమిటీల ఆధ్వర్యంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వయో వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బిచేనపల్లి ప్రకాష్‌రావు, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ సూర్యకుమార్, బార్ అసోసియేషన్ కార్యదర్శి సైదులు, క్లబ్ ప్రతినిధులు రాంమోహన్‌రావు, ప్రభాకర్‌రావు, సూర్యచందర్, యాదగిరెడ్డి, మునీందర్‌రావు, ఎర్ర శంభులింగారెడ్డి, బ్రహ్మదేవర రమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు కృషిచేయాలి

శాలిగౌరారం: సమాజంలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేయాలని ఐకేపీ డీపీఎం మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి అన్నారు. శాలిగౌరారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు వ్యవహరిస్తున్న విధానాలు, స్నేహితుల మధ్య సంబంధాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



మండల సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోవాలి

నల్లగొండ టూటౌన్: గతంలో నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న పట్టణ ప్రజలు ఉచిత విద్యుత్ పొందని అర్హులు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ బుధవారం తెలిపారు. కరెంట్ బిల్లు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌తో మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బంద్ ప్రశాంతం

నల్లగొండ రూరల్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త బంద్‌లో భాగంగా బుధవారం నల్లగొండ ఆర్టీసీ డిపో వద్ద బంద్ నిర్వహించారు. జాతీయ మాలమహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు గోలి సైదులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీల మధ్య వర్గీకరణ పేరుతో గొడవలు, అంతరాన్ని సృష్టిస్తోందన్నారు. వర్గీకరణ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అద్దంకి రవీందర్, చింతపల్లి బాలకృష్ణ, సంద యాదగిరి, విఘ్నేష్, గందిమల్ల శ్రీను, చంద్రశేఖర్, పంబాల అనిల్‌కుమార్, రాజారావు, లలిత, రామకోటి పాల్గొన్నారు.

మునుగోడు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన భారత్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. మునుగోడులోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నరేందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు సంఘం నాయకులు పెరమాండ్ల ప్రమోద్ కుమార్, ముచ్చపోతుల శ్రీనివాస్, రెడ్డిమళ్ల యాదగిరి, చలిచీమల యాదగిరి, బాల శివరాజు, శ్రీకాంత్, రవీందర్, శ్రీరామ్, లక్ష్మయ్య, శ్రీను పాల్గొన్నారు.

కట్టంగూర్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా బీఎస్పీ, మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం కట్టంగూర్ మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను మూసివేయించారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు గండమల్ల అంతయ్య, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గోగు బాలసైదులు, యూత్ నాయకులు బొల్లెద్దు నర్సింహ, బీఎస్పీ నాయకులు కత్తుల కాన్షీరాం, లక్ష్మీనారాయణ, గోగు మహేష్, వినోద్, కిషన్, రమేష్, ఎల్లేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మర్రిగూడ: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చేపట్టిన భారత్‌బంద్ బుధవారం మర్రిగూడ మండలంలో ప్రశాంతంగా ముగిసింది. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు నాగిళ్ల మారయ్య, ఈద కృష్ణ, కాశీ, ప్రభుదాస్, నరేష్, కిరణ్, అఖి, సందేష్, చరణ్ పాల్గొన్నారు.

చండూరు: చండూరు మండలంలో మాల మహానాడు జిల్లా నాయకుడు కాశమల్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మేడిపల్లి లక్ష్మణ్, అద్దంకి కిరణ్, దాసరి వెంకటేశం, సరిపల్లి రమేష్, తీగల వెంకన్న, గుండమళ్ల నరసింహులు, తీగల కేశవులు, కాశమల్ల కరుణాకర్, కస్తాల మాజీ ఎంపీటీసీ గుండమల వెంకటేశం, యాదగిరి, మహేశ్వరం రామలింగం, మహేశ్వరం అనిల్, గౌతమ్, మహేశ్వరం, మహేష్, ఈసం శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.



మునుగోడు అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న మాలమహానాడు నాయకులు



నల్లగొండ రూరల్: ధర్నా చేస్తున్న మాల మహానాడు నాయకులు